సాక్షి
వికారాబాద్
శనివారం ı 30 ı మార్చి ı 2024




అంతరిస్తున్న అడవులు

మానవ మనుగడకు ఆధారమైన అడవులు ప్రమాదపుటంచుల్లోకి వెళ్లాయి. ఆక్రమణలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. 8లో▸



మోదీ చొరవతోనే అభివృద్ధి

ప్రధాని మోదీ చొరవతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. 8లో▸



న్యూస్‌రీల్

తాగునీటి సమస్య రావొద్దు

జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



అనంతగిరి: జిల్లాలో తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పట్నం సునీతారెడ్డి జిల్లా పంచాయతీ, తాగునీటి సరఫరా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడారు. భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరించాలని సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు. ప్రజలు తాగునీటిని వృథా చేయరాదని సూచించారు. చెరువులు, కుంటల్లో నీరు లేనందున మూగజీవాల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లోని నీటి తొట్టిలను నింపాలని ఆదేశించారు.

ప్రజా పాలనతో సమన్యాయం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనను చూసి వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నాప్పారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆమనగల్లు, మాడ్గుల, వెల్దండ మండలాలకు చెందిన పలువురు నాయకులు కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ పాలనలోనే ప్రజలందరికీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అందుతాయని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పాలన న్చిన ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు, నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆయన చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అన్ని స్థానాలలో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఐదు దుకాణాల్లో చోరీ

హార్డ్ డిస్కులు, సెల్‌ఫోన్లు, రూ.50 వేల నగదు మాయం

చేవెళ్ల: పట్టణంలోని ఐదు దుకాణాల్లో అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటనలో హార్డ్ డిస్కులు, సెల్ ఫోన్స్, రూ.50వేల నగదు, ఇతర సామాన్లు దోచుకెళ్లారు. ఈ ఘటన మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రదీప్‌కుమార్ తెలిపిన ప్రకారం.. అర్ధరాత్రి మొదట శాంతి మనీ ట్రాన్స్‌ఫర్ షాపు పైకప్పు రేకులు తొలగించి సీసీ కెమెరాల హార్డ్ డిస్క్, ఇంటర్నెట్ బాక్స్, రూ.10వేల నగదు, మొబైల్ ఫోన్స్ , అదే లైన్‌లో ఉన్న మణికంఠ ట్రేడర్స్ దుకాణంలో రూ.10వేల నగదు, కిరాణ సామగ్రి, మరో కూల్ పాయింట్, జనరల్ దుకాణంలో ఇంటర్నెట్ బాక్స్, నగదు, శ్రీబాలాజీ స్టీల్, సిమెంట్ షాపులో రూ.11వేల నగదు, సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్ దొంగిలించారు. రమేశ్ లాండ్రీ షాపులో చొరబడి నగదు, ఐరన్ బాక్స్ ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం షాపులు తెరవగానే అంతా చిందరవందరగా ఉండటంతో పాటు నగదు, హార్డ్‌డిస్కులు కనిపించకపోవడంతో బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరకున్న పోలీసులు షాపులను పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



తాండూరు టౌన్: తాండూరులోని నజరేతు చర్చిలో సందేశం ఇస్తున్న పాస్టర్ అశోక్ కుమార్

ప్రత్యేక ప్రార్థనలు

గుడ్ ఫ్రైడేని పురస్కరించుకొని తాండూరు నజరేతు చర్చి, అంతారం మెథడిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రపంచ శాంతిని ఆకాంక్షించిన ఏసు శిలువ వేసిన రోజును గుర్తు చేసుకుంటూ ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తి గీతాలు ఆలపించారు. పాస్టర్లు దైవ సందేశం వినిపించారు.

– తాండూరు టౌన్/రూరల్



తాండూరు రూరల్: అంతారం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు

జలకాలాటలలో..

సరదాగా నీటిలో ఆడుకోవడానికి మించిన ఆనందం మరొకటి ఉండదు. వేసవి వచ్చిందంటే యువకులు, చిన్నారులు ఈత కొట్టేందుకు చెరువులు, కుంటలు, బావుల వద్దకు పరుగులు పెడతారు. తోటి వారితో కలసి ఉత్సాహంగా, ఉల్లాసంగా సేదతీరుతారు.

సందడిగా స్విమ్మింగ్ పూల్స్

- సరదా తోపాటు ఆరోగ్యం
- వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతున్న యువత, చిన్నారులు
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు



పరిగి పట్టణంలోని ఓ స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకుంటున్న చిన్నారులు

దోమ: రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతోంది. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఎండ నుంచి సేదతీరేందుకు యువకులు, చిన్నారులు ఈత కొట్టేందుకు పరుగులు పెడుతున్నారు. ఒంటిపూట బడులు కావడంతో స్కూళ్లు వదలగానే చెరువులు, బావుల్లో సరదాగా ఈత కొడుతున్నారు. స్విమ్ చేయడం సరదా తోపాటు ఆరోగ్యానికి ఎంతో మేలని వైద్యులు అంటున్నారు. ఈత కొట్టడం చక్కటి వ్యాయామం అని, మానవ శరీరంలోని అన్ని అవయవాలకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. పట్టణాల్లో వేసవి నుంచి ఉపశమనం పొందడానికి యువకులు స్విమ్మింగ్ పూల్స్ బాట పడుతుంటే గ్రామాల్లో బావులు, చెరువులు, కుంటలకు వెళుతున్నారు. ఈ ఏడాది చెరువుల్లో నీరు లేదు. దీంతో ఈత నేర్చుకునేందుకు, స్విమ్ చేయడానికి యువకులు, చిన్నారులు పట్టణాల్లోని స్విమ్మింగ్ పూల్స్‌కు వెళుతున్నారు. ఈత నేర్చుకునే సమయంలో ఏ మాత్రం అశ్రద్ధ వహించినా ప్రాణాలకు ముప్పని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు.

- ఈత రాని వారు చెరువులు, కుంటల వద్ద జాగ్రత్తగా ఉండాలి. నీటికి దూరంగా ఉంటే మరీ మంచిది. చిన్నారులను తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టుకొని ఉండాలి.

పాటించాల్సిన జాగ్రత్తలు

- ఈత నేర్చుకోవాలనుకునే వారు ప్రత్యేక సాధనాలైన గాలి నింపిన రబ్బరు ట్యూబ్‌లు, బెండ్లు, ప్లాస్టిక్ డబ్బాలను వాడాలి.
- సహాయకులు లేని సమయంలో నీటిలోకి దిగరాదు.
- దమ్ము, మూర్ఛ వ్యాధి ఉన్నవారు నీటికి దూరంగా ఉండాలి.
- సరదా కోసం నీటిలో సాహసాలు, ప్రమాదకర విన్యాసాలు చేయరాదు.
- శుభ్రమైన నీటిలో మాత్రమే ఈత కొట్టాలి. అప్పుడే ఆరోగ్యకరంగా ఉంటారు.
- ఈత కొట్టే సమయంలో ఒకరిని ఒకరు నీటిలో ముంచుకోవడం వంటివి చేయరాదు.

ఈత నేర్చుకునేందుకు పట్టణాలకు..

మండలంలోని ఐనాపూర్, దాదాపూర్, దిర్సంపల్లి, మోత్కుర్, పాలేపల్లి, కిష్టాపూర్, బొంపల్లి, శివారెడ్డిపల్లి, బాస్‌పల్లి, ఖమ్మం నాచారం గ్రామాల్లో చెరువులు, బావులు ఉన్నాయి. గత ఏడాది పిల్లలు, యువకులు స్థానిక చెరువులు, కుంటలు, బావుల్లో ఈత కొట్టేవారు. నేర్చుకునే వారు. కానీ ఈ ఏడాది నీరు లేకపోవడంతో పట్టణాల బాట పట్టారు. ఒంటి పూట బడులు కావడంతో తల్లిదండ్రులతో కలసి పట్టణాల్లోని స్విమ్మింగ్ పూల్స్‌కు వెళుతున్నారు.



బాస్‌పల్లి సమీపంలోని కుంటలో ఈత కొడుతున్న యువకులు, చిన్నారులు

స్నేహితులతో కలసి..



ఈత నేర్చుకోవడం ఎంతో మేలు. ఒంటిపూట బడులు కావడంతో మధ్యాహ్నం స్నేహితులతో కలసి ఈత కొట్టడానికి వెళుతున్నాం. స్విమ్మింగ్ చేయడం ఎంతో సంతోషంగా ఉంటుంది. శరీరం కూడా తేలిక అవుతుంది.

– వరుణ్ సందేశ్, బాస్‌పల్లి

పిల్లలకు స్విమ్మింగ్ నేర్పుతున్నా



నీటి ప్రమాదాలు జరిగినప్పుడు తప్పించుకునేందుకు, ఇతరులకు సహాయ పడేందుకు ఈత ఎంతగానే ఉపయోగపడుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ స్విమ్మింగ్ నేర్చుకోవాలి. వేసవిలో ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు చాలా మంది స్విమ్మింగ్ చేయడానికి వెళుతుంటారు. చిన్నారులు బావి వద్దకు వస్తుండటంతో వారికి ఈత నేర్పించేందుకు కృషి చేస్తున్నా. స్విమ్మింగ్ ఆత్మ రక్షణకు ఎంతో దోహదపడుతుంది.

– చాకలి భాస్కర్, బొంపల్లి

సర్వరోగ నివారిణి

ఊపిరితిత్తుల సమస్య, గుండె పోటు తదితర వ్యాధులకు ఈత దివ్యౌషధంగా పని చేస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచి, సర్వరోగ నివారణి అవుతుంది. శరీరంలోని ప్రతి అవయవానికి పని కల్పించి చురుగ్గా ఉంచుతుంది.

– శ్రీవిద్య, వైద్యాధికారి, దోమ



సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

కాంగ్రెస్‌కు పట్టం కట్టాలి

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి

మహేశ్వరం: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను చిత్తుగా ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. తుక్కుగూడలోని గిగా సిటీ కేఎల్ఆర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పని చేయడానికి ఆ పార్టీలో చేరానన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొంతమంది నేతలు తనపై అసత్య ఆరోపణలు, విమర్శలు చేయడాన్ని ఖండించారు. కేంద్రంలో పదేళ్ల బీజేపీ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. ప్రశ్నించే గొంతుకలను నరేంద్రమోదీ అణచివేసి అక్రమ కేసులు బనాయించి, అరెస్టు చేయిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో చేవెళ్లతో పాటు 14 ఎంపీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితారెడ్డికి గేట్లు తెరిచేది లేదన్నారు. గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో చర్చించిన తర్వాత వారు అంగీకరిస్తే ఇతర పార్టీలకు చెందిన వారిని చేర్పించుకుందామన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని.. సోనియమ్మ, రాహుల్ గాంధీకి కానుకగా ఇవ్వాలన్నారు.కార్యక్రమంలో జెడ్పీచైర్ పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ మంత్రి కొండ్రు పుష్పలీల, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, చిగురింత నర్సింహారెడ్డి, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడ సభను విజయవంతం చేయాలి

తుక్కుగూడలో వచ్చేనెల 6న నిర్వహించే కాంగ్రెస్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బహిరంగ సభా స్థలాన్ని కాంగ్రెస్ నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ వచ్చి తెలంగాణకు ఆరు గ్యారంటీలను ప్రకటించిట్టే.. రాహుల్ గాంధీ తుక్కుగూడ సభకు హాజరై జాయతీ స్థాయిలో 5 గ్యారంటీలను ప్రకటించనున్నారని తెలిపారు. 25 అంశాలతో గ్యారంటీ స్కీంలను తమ మేనిఫెస్టోగా రూపొందించిందన్నారు. పాంచ్ న్యాయ్ అంటూ మేనిఫెస్టోకు పార్టీ నామకరణం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలను తుక్కుగూడ వేదికగా రాహుల్ గాంధీ, ఖర్గే ప్రకటించనున్నట్లు చెప్పారు. సభకు ప్రతి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

బాలిక దారుణ హత్య

రాజేంద్రనగర్: బాలిక దారుణ హత్యకు గురైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జల్‌పల్లి శ్రీరాంనగర్ కాలనీకి చెందిన బాలిక కుటుంబం గతంలో అత్తాపూర్ హసన్‌నగర్ ప్రాంతంలో మోయిన్ అనే యువకుడి కుటుంబానికి చెందిన ఖాళీ స్థలంలో నివాసం ఉండేది. ఇద్దరు పిల్లల తండ్రి అయిన మోయిన్ తరుచూ సదరు బాలిక వెంట పడుతుండటంతో ఆమె కుటుంబం అక్కడ ఇల్లు ఖాళీ చేసి శ్రీరాంనగర్ కాలనీకి మకాం మర్చింది. అయినా మొయిన్ ఆమెను వేధిస్తూనే ఉన్నాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఆమెను కాటేదాన్ ప్రాంతానికి పిలిపించాడు. అనంతరం ఆమెను కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బండరాయితో మోది హత్య చేసి అక్కడినుంచి పరారయ్యాడు. శుక్రవారం ఉదయం వాకింగ్ చేసేందుకు వచ్చిన వారు బాలిక మృతదేహాన్ని గుర్తించి మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

రైతు రుణమాఫీ చేసి తీరుతాం



సమావేశంలో మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

- ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం
- పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి అండగా నిలుస్తుందని పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కుల్కచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు తాము ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని అన్నారు. గత ప్రభుత్వం అవినీతికి పాల్పడి ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించిందని ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి కొత్త పథకాల అమలుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఆరు గ్యారంటీలపై ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు ఇచ్చిన రుణమాఫీ మాటను నిలబెట్టుకుంటామన్నారు. ఎవ్వరూ కరెంట్ బిల్లులు కట్టవద్దని, ఎవరైనా బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేస్తే తమకు ఫోన్ చేయాలని సూచించారు. జర్నలిస్టులకు కూడా మా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య మాట్లాడారు. పీఏసీఎస్ మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి రూ. పది లక్షలు, విశ్రాంతి భవనానికి మరో రూ. 10 లక్షలు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యా హరిశ్చంద్ర, పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, ఎంపీటీసీ ఆనందం, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, నాయకులు వెంకటయ్య, కొండయ్య, నర్సింలు, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం పెంచేందుకే సమ్మర్ క్యాంప్

- తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల ఆర్‌సీవో శారద

మొయినాబాద్‌రూరల్: విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేలా, క్రమశిక్షణ అలవర్చుకునే విధంగా సమ్మర్ క్యాంప్ నిర్వహించినట్లు గురుకులాల ఆర్‌సీవో శారద అన్నారు. 15 రోజులుగా మండలంలోని తోల్‌కట్ట సమీపంలో గల చేవెళ్ల గురుకుల కళాశాలలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పది కళాశాలలకు చెందిన విద్యార్థినులకు వివిధ రకాల నైపుణ్య కోర్సులను నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ముగింపు సమావేశానికి చేవెళ్ల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి అధ్యక్షత వహించగా శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు పూర్తి చేసుకున్న విద్యార్థినులు సెలవు దినాల్లో సమయం వృథా చేయకుండా వారి విజ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవి శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ.. 15 రోజుల పాటు వివిధ మండలాల్లోని ఆయా కళాశాలలకు చెందిన విద్యార్థినులు ఆయా అంశాల్లో తర్ఫీదు పొందారని చెప్పారు. కార్యక్రమంలో బంట్వారం ప్రిన్సిపాల్ ఉషారాణి, రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థినులతో అధికారులు, అధ్యాపకులు

ప్లైవుడ్ గోదాంలో అగ్నిప్రమాదం

సుమారు రూ.కోటిన్నర నష్టం

హయత్‌నగర్: తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని తొర్రూర్‌లో ఉన్న గీతా టింబర్ డిపోలో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. టింబర్ డిపో గోదాంలో నిల్వ ఉన్న ప్లైవుడ్ పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదానికి కరెంట్ షాక్ కారణమని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గోదాము పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.కోటిన్నర వరకు నష్టం వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. దీనిపై ఇప్పటి వర కు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



క్లుప్తంగా

ధ్యానంతో ఒత్తిడి దూరం

కుల్కచర్ల: ధ్యానంతో ఒత్తిడిని దూరం చేసుకోవచ్చునని పిరమిడ్‌ స్పిరుచువల్‌ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్ల ఆంజనేయరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కాముునిపల్లి, పీరంపల్లి, బండవెల్కిచర్ల, రాంనగర్‌ గ్రామాల్లో ధ్యానంతో మానసిక ప్రశాంతత నెలకొంటుందన్నారు. ప్రతీరోజు ధ్యానం చేయాలని తద్వార ఆరోగ్యంగా ఉంటారన్నారు. నిత్యజీవితంలో ప్రజలు ఎదుర్కొంటున్న బీపీ, షుగర్‌, గుండెజబ్బులను ధ్యానం నివారిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్‌ సంస్థ సభ్యులు బాలకృష్ణారెడ్డి, గుండం తిరుపతయ్య, వెంకటేశ్‌, గుండం శైలజ, శోభిత, చెన్నయ్య, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.44లక్షలు సీజ్‌



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

దౌల్తాబాద్‌: పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని చంద్రకల్‌ అంతర్‌ రాష్ట్ర సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ వద్ద పోలీసులు నగదును సీజ్‌ చేశారు. కర్ణాటక రాష్ట్రం గుర్మిట్‌కల్‌కు చెందిన ఓ వ్యక్తి తన కారులో రూ.1.44లక్షల నగదు తీసుకెళ్తున్నాడు. తనిఖీల్లో నగదును గుర్తించిన పోలీసులు రసీదు లేకపోవడంతో డబ్బును సీజ్‌ చేసినట్లు ఎస్‌ఐ శ్రీశైలం యాదవ్‌ తెలిపారు. నిబంధనల ప్రకారం రూ.50వేలకు మించి రసీదు లేకుండా నగదుంటే సీజ్‌ చేస్తామన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య

దౌల్తాబాద్‌: మండల కేంద్రంలో పెద్దచెరువులో ఓ వ్యక్తి అనుమానస్పదంగా మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన గట్టని ఆశప్ప(40) గురువారం ఇంట్లో నుంచి వెళ్లి శుక్రవారం శవమై తేలాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరకుకున్న పోలీసులు శవాన్ని వెలికితీసి ఆశప్పగా గుర్తించారు. ఆశప్పకు మూర్ఛ వ్యాధి ఉందని.. స్నానానికి చెరువుకు వెళ్లి ఫిట్స్‌ రావడంతో మృతిచెంది ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీశైలంయాదవ్‌ తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

యాలాల: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్‌ఐ శంకర్‌ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్‌ వద్ద గురువారం ఎదురెదురుగా వస్తున్న ఆటో, జీపు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కుర్వ మల్లప్ప మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటయ్య(45) శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్క్రాప్‌ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం

శంషాబాద్‌: పట్టణంలోని రాళ్లగూడ రహదారిలో గల స్క్రాప్‌ దుకాణంలో శుక్రవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఉదయం 9 గంటల ప్రాంతంలో షార్ట్‌సర్క్యూట్‌తో షాపులోని పేపర్లు, ప్లాస్టిక్‌ ఇతర వ్యర్థాలకు మంటలు వ్యాపించాయి. వెనుక భాగంలో పెద్ద ఎత్తున నిల్వ చేసిన పేపర్లు, ప్లాస్టిక్‌ బ్యాగులు, ఇతర వ్యర్థపదార్థాలను కూడా అంటుకున్నాయి. దీంతో స్థానికులు ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించారు. పక్కనే గ్యాస్‌ ఏజెన్సీ ఉండడంతో సిబ్బంది వెంటనే సిలిండర్లను బయటకు తీసుకెళ్లారు. మూడు ఫైరింజన్ల సాయంతో రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

SERVICES

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్‌ ల్యాప్‌ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్‌ అగ్రికల్చర్‌ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్‌ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-12 52718]

WANTED

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్‌, నర్సులు, ఆయాలు, డ్రైవర్స్‌, భార్యాభర్తలు కావలెను. ఫోన్‌: 9391036981, 9246585901. [HA-13624]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌/ డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అంతరిస్తున్న అడవులు

- ఇప్పటికే 25శాతానికి పైగా అటవీ భూముల ఆక్రమణ
- యథేచ్ఛగా కలప వ్యాపారం
- అడవులకు నిప్పంటిస్తున్న వైనం
- ఉపేక్షిస్తున్న అధికారులు



వికారాబాద్‌: మానవ మనగడకు ఆధారమైన అడవులు నేడు ప్రమాదపుటంచుల్లోకి వెళ్లాయి అడవుల ఆక్రమణలకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. అటవీ భూములు కబ్జా చేస్తున్న రియల్టర్లు, క్వారీల నిర్వాహకులు, రిసార్ట్స్‌ యజమానులు యథేచ్ఛగా తమ వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఆక్రమణలకు అడ్డకట్టవేసేందుకు ప్రయత్నించిన అధికారులకు బదిలీవేటు తప్పడం లేదు. అక్రమార్కులతో ప్రజా ప్రతినిధులు సైతం కుమ్మక్కై దోపిడీలో భాగస్వాములవుతున్నారు. జిల్లాలో మొత్తం 1,08,000 ఎకరాల అటవీ భూములుండగా.. ప్రస్తుతం అటవీశాఖ అధికారుల లెక్కల ప్రకారం 25 శాతానికి(31 వేల ఎకరాలు) పైగా భూములు ఆక్రమణకు గురైనట్లు గణాంకాలు చెబుతునాయి. జిల్లాలో మొత్తం 94 ఫారెస్టు బ్లాకులుండగా అందులోని కొన్ని బ్లాక్‌లలో ఉన్న ఏరియా మొత్తం కబ్జా కోరల్లోకి వెళ్లి పోయింది. మరికొన్ని చోట్ల 50 శాతం నుంచి 90 శాతం వరకు అటవీ ప్రాంతం కబ్జాలకు గురయిందంటే ఆక్రమణలు ఏ స్థాయిలో చోటు చేసుకున్నాయో అర్థమవుతోంది. అటవీ భూములు గతంలో పోడు రూపంలో కేవలం వ్యవసాయం కోసమే కబ్జా చేసే వారు కాగా ప్రస్తుతం వ్యాపారం కోసం కబ్జాలకు పాల్పడుతున్నారు. రక్షించాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తుండటంతో జిల్లాలో అడవులు ప్రమాదపుటంచుల్లోకి నెట్టివేయబడ్డాయి.

వాల్టాకు టాటా

జిల్లాలో 1,08,000 ఎకరాల విస్తీర్ణంలో అటవీ భూములుండగా జిల్లా భౌగోళికంగా 13 శాతం అటవీ భూములున్నాయి. ఇందులో తొమ్మిది శాతం గ్రీనరి అంటే 15వేల ఎకరాల్లో దట్టమైన అడవులున్నాయి. ఈ అటవీ ప్రాంతాన్ని ఐదు క్లస్టర్లుగా 94 బ్లాకులుగా విభజించగా ఇందులో అనంతగిరి ప్రాంత అడవి ప్రధానమైంది. కుల్కచర్ల, చించోలి ప్రాంత అడవిలో చిరుతల సంచారం ఉంది. అనంతగిరిలో ఐనాలు, దుప్పులు, దున్నలు, కొండగొర్రెలు, తదితర జంతు జాతులు ఉన్నట్టు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. అటవీ విస్తీర్ణం పెంచేందుకు హరితహారం లాంటి కార్యక్రమాలు తీసుకుని అమలు చేస్తుండగా మరో పక్క అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం, కబ్జాల కారణంగా అటవి విస్తీర్ణం తగ్గిపోతోంది. కలప వ్యాపారులు యథేచ్ఛగా చెట్లు నరికేస్తున్నారు. ఈ వ్యాపారం సైతం అధికారుల కనుసన్నల్లోనే కలప వ్యాపారం జరుగుతుందనే ఆరోపణలున్నాయి. అటవీ సంపద తరిగి పోతుండటంతో వన్యప్రాణుల జీవనానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. అటవీ భూముల సర్వే చేసి పక్కగా హద్దులు ఏర్పాటు చేస్తేనే అడవులను కాపాడడం సాధ్యమని ఆ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

అందరి సహకారం అవసరం

సహజ సిద్ధమైన వాతావరణం కలిగిన ఈ ప్రాంతాన్ని కాపాడుకోవటంలో అందరి సహకారం అవసరం. కొండలు, అడవుల అందాలను మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్లాస్టిక్‌ వాడకం నిషేధించాం. ధూమపానం కారణంలో అడవుల్లో మంటలంటుకుంటున్నాయి. దీంతో కొన్ని రకాల జంతువులు మృత్యువాత పడుతున్నాయి. కొందరు కావాలని నిప్పుపెడుతున్నారని ఇటీవల మా దృష్టికి వచ్చింది, త్వరలోనే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం.

– జ్ఞానేశ్వర్‌, అటవీశాఖ జిల్లా అధికారి

అటవీ భూముల్లో అక్రమాలు

ఇటీవల కొందరు దామగుండం అటవీ ప్రాంతంలో అలజడి సృష్టించేందుకు పనిగట్టుకుని అడవికి నిప్పుపెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ విషయం అధికారుల దృష్టికి సైతం వచ్చింది. అయినా స్పందన కరువవడంతో విమర్శలకు తావిస్తోంది. వికారాబాద్‌ రేంజ్‌లోని అటవీ భూముల్లో రెండు క్వారీలు నిర్వహిస్తూ ఒకచోట రూ.160 కోట్లు, మరో చోట రూ.60 కోట్ల విలువైన ఖనిజాన్ని అక్రమంగా తవ్వి తరలించారని తేల్చారు. ఆరు నెలల క్రితం కోర్టులో కౌంటర్‌ దాఖలు చేశారు. తాండూరు ఫారెస్టు రేంజ్‌లోని ఓ క్వారీలో సైతం రూ.60 కోట్ల విలువైన ఖనిజ సంపద కొల్లగొట్టారని గుర్తించి కోర్టులో కౌంటర్‌ దాఖలు చేశారు. దుద్యాల ఫారెస్టు పరిధిలోని ఓ క్వారీ సైతం అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారని నోటీసులు జారీ చేశారు. అనంతగిరి సమీపంలో ఫారెస్టు భూమిని ఆక్రమించిన ఓ రిసార్ట్స్‌కి నోటీసులు ఇవ్వటంతో పాటు కోర్టులో కౌంటర్‌ వేశారు. పూడూరు మండలం దామగుండం సమీపంలో ఫారెస్టు భూమిలో ఓ రిసార్ట్స్‌ ఏర్పాటు చేయగా వారికి నోటీసులు ఇవ్వటంతో పాటు కోర్టులో కౌంటర్‌ దాఖలు చేశారు. గడిచిన ఆరు నెలల్లో నలుగురు జిల్లా ఫారెస్టు అధికారులు మారారు. ఇంకేముంది. షరామామూలే అన్నట్టు యథేచ్ఛగా క్వారీలు, కలప వ్యాపారం, ఆక్రమణలు కొనసాగుతూనే ఉన్నాయి.



● బొడ్రాయి వార్షికోత్సవం

బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

మండలం పరిధిలోని సాల్వీడు గ్రామంలో బొడ్రాయిని ప్రతిష్ఠాపన చేసి సంవత్సరం పూర్తికావడంతో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బొడ్రాయికి క్షీర, జలాభిషేకం చేశారు. మహిళలు బోనాలు సమర్పించారు.

– కుల్కచర్ల

గంజాయి విక్రేతలకు రిమాండ్‌

ఇబ్రహీంపట్నం రూరల్‌: ఇంజినీరింగ్‌ విద్యార్థులే టార్గెట్‌గా గంజాయి వ్యాపారం చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌లోని ధూల్‌పేట్‌ ప్రాంతానికి చెందిన రాజుసింగ్‌(37) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆరు నెలలుగా వినాయక విగ్రహాలు తయారు చేస్తుండే వాడు. వ్యసనాలకు బానిసైన రాజుసింగ్‌ కూలీ డబ్బు సరిపోకపోవడంతో గంజాయి అమ్మే వ్యాపారాన్ని ఎంచుకున్నాడు. ఇదే ప్రాంతంలో ఉండే ఆశిష్‌సింగ్‌, బీజ్మాబాయి వద్ద రూ.10వేల చొప్పున గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌ చుట్టుపక్కల రూ.15వేలకు కిలో చొప్పున విక్రయిస్తున్నాడు. గంజాయి తాగుడుకు బానిసైన ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం, ప్రకాశం జిల్లా కందుకూరు మండలానికి చెందిన ఉప్పు లోకేశ్వర్‌ ఇంజాపూర్‌ సమీపంలోని కమ్మగూడ ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు. రాజుసింగ్‌ మాదిరిగా వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్న ఆయన వారం రోజుల క్రితం 1.5 కేజీల గంజాయి కొనుగోలు చేసి 50 గ్రాముల ప్యాకెట్‌లు తయారు చేసి ఆదిబట్ల చుట్టుప్రక్కల కంపెనీలు, ఇంజినీరింగ్‌ కళాశాల విద్యార్థులు, వండర్‌లా వద్ద అమ్మి డబ్బులు సంపాదిస్తుంటాడు. గంజాయి సేవించే వ్యక్తులు బబ్లు, సంతోష్‌, సెల్వా, శివ, కరణ్‌, అప్పు, మీనాజ్‌ నాలుగు కేజీలు కావాలని కోరారు. దీంతో లోకేశ్వర్‌ రాజుసింగ్‌కు ఫోన్‌ చేయగా 2 కేజీలు ఉందని చెప్పాడు. రాజుసింగ్‌ 2 కేజీలతో, లోకేశ్వర్‌ 1.2 కేజీలతో ఆదిబట్ల మున్సిపాలిటీలోని బీరప్ప గుడి వద్ద కలుసుకున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు మహేశ్వరం డీసీపీ ఆదేశాల మేరకు రాజుసింగ్‌(37), లోకేశ్వర్‌ (20)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద 3.2 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రాజుసింగ్‌పై గతంలో పలు పోలీస్‌ స్టేషన్లల్లో ఎన్‌డీపీఎస్‌ యాక్టు కేసులు నమోదయ్యాయన్నారు. గంజాయికి అలవాటు పడిన విద్యార్థులకు సరైన అవగాహన కలిప్తామని.. దురలవాట్ల జోలికి పోకూడదని సీఐ రాఘవేందర్‌రెడ్డి సూచించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ కృష్ణయ్య, వెంకటేశ్‌లతో పాటు పోలీసు సిబ్బందిని అభినందించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

కిరాణా దుకాణంలో షార్ట్‌సర్క్యూట్‌

రూ.20లక్షల మేర ఆస్తి నష్టం

పరిగి: షాట్‌ సర్క్యూట్‌తో కిరాణా దుకాణం దగ్ధమై రూ.20లక్షల నష్టం వాటిల్లింది. ఈ ఘటన యాబాజిగూడలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్ము నారాయణ కిరాణ దుకాణంలో గురువారం అర్ధ రాత్రి షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వెంటనే బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరకునే లోపే దుకాణంలో వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో ఆరు తులాల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి, రూ.లక్ష నగదు, కిరాణ దుకాణం, లేడిస్‌ కార్నర్‌ సామగ్రి మొత్తం పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.20లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు బోరుమన్నారు. అగ్ని ప్రమాదంలో ఇంటి పగుళ్లు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి సాయమందేలా చర్యలు తీసుకుంటానన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కారు బోల్తా

కుల్కచర్ల: అదుపుతప్పిన కారు బోల్తాపడింది. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... శంకర్‌పల్లికి చెందిన ముగ్గురు వ్యక్తులు మారుతి ఎర్టిగా కారులో వాల్యానాయక్‌ తండాలో వివాహానికి హాజరయ్యారు. తిరుగుప్రయాణంలో మూజాహిద్‌పూర్‌ గేటు సమీపంలో వాహనం అదుపుతప్పి అటవీశాఖ తవ్విన ట్రెంచ్‌లో పడిపోయింది. కారులో ఉన్న శరత్‌కు చేయి ఫ్యాక్చర్‌ అవ్వగా.. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు.



గుంతలో పడిపోయిన కారు

సారాయి తయారు చేస్తే కఠిన చర్యలు



ఎక్సైజ్‌ దాడుల్లో పట్టుబడిన నాటుసారా, నిందితులను చూపుతున్న పోలీసులు

- ఆమనగల్లు ఎక్సైజ్‌ సీఐ బద్యానాద్‌ చౌహాన్‌
- ఎక్సైజ్‌ దాడుల్లో నలుగురి అరెస్ట్‌

ఆమనగల్లు: ఎక్సైజ్‌ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమనగల్లు ఎక్సైజ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం ఎక్సైజ్‌ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాలుగు కేసులు నమోదు చేసి నలుగురిని అరెస్ట్‌ చేశారు. పీఎస్‌ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలంలోని గ్రామాలు, తండాల్లో తనిఖీలు చేపట్టారు. మాడ్గుల మండలం కేతావత్‌ తండాలో గోపాల్‌, మాలి దగ్గర నాలుగు లీటర్ల సారాయిని స్వాధీనం చేసుకున్నారు. మాడ్గుల మండలం కొర్రతండాలో బలరాం, శంకర్‌ వద్ద సారాయిని సీజ్‌ చేశారు. కొర్రతండా గుట్టల సమీపంలో సారాయి తయారీ కేంద్రంపై దాడి చేసి బెల్లం పానకం ధ్వంసం చేశారు. అనంతరం నలుగురు వ్యక్తులను అరెస్ట్‌ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఆమనగల్లు ఎక్సైజ్‌ సీఐ బద్యానాద్‌చౌహాన్‌, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ టీమ్‌ జిల్లా ఇన్‌చార్జి, సీఐ చంద్రశేఖర్‌, డీటీఎఫ్‌ సరూర్‌నగర్‌ టీం ఇంచార్జి, సీఐ సత్యానారాయణ, మహేశ్వరం ఎక్సైజ్‌ సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎక్సైజ్‌ సీఐ సీతారాంరెడ్డి, పెద్ద ఎత్తున ఎక్సైజ్‌ పోలీసులు పాల్గొన్నారు. అనంతరం ఆమనగల్లు ఎక్సైజ్‌ పోలీసు స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ.. ఎక్సైజ్‌ శాఖ ఆధ్వర్యంలో నిరంతరం దాడులు నిర్వహిస్తామని, నాటుసారా తయారుచేసినా, విక్రయించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మోదీ చొరవతోనే అభివృద్ధి

బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పరిగి: ప్రధాని మోదీ చొరవతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్‌ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పట్టణ కేంద్రంతో పాటు రంగాపూర్‌, మాదారం తదితర గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌ పాలనపై విశ్వాసం కోల్పోయిన ప్రజలు అధికార మార్పును కోరుకున్నారన్నారు. పదేళ్ల కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రధాని మోదీ ఆధ్వర్యంలో సంక్షేమ పాలన అందించిందన్నారు. 60 ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ దేశ ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో బీజేపీ 400 స్థానాల్లో గెలుపొంది మరో సారి అధికారం చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌లు రెండూ ఒకటేనని.. ఈ ఎన్నికల్లో రెండు పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. పార్లమెంట్‌ ఎన్నికలు దేశానికి సంబంధించిన ఎన్నికలు అని ప్రజలకు వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అమలు కానీ హామీలను ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక ప్రజలను మభ్యపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.



పూడూరు: మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ఆశీర్వదించండి.. అండగా ఉంటా

పూడూరు: పార్లమెంట్‌ ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే అండగా ఉంటానని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో భాంగా శుక్రవారం మండల పరిధిలోని చింతలపల్లి, నిజాంపేట్‌, మేడిపల్లి, మంచన్‌పల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎంపీగా ఉన్నప్పుడు గ్రామాల్లో చేసిన అబివృద్ధి పనులు గుర్తు చేశారు. తెలంగాణ వస్తే బ్రతుకులు బాగుపడుతాయనకుంటే కేవలం కేసీఆర్‌ కుటుంబం మాత్రమే అభివృద్ధి చెందిందని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో గ్రామాల రూపురేఖలు మారాయన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గడపగడపకు తెలిపేందుకే యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. చేవెళ్ల గడ్డపై కాషాయం జెండా ఎగురవేసే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతికిరణ్‌, సెన్సార్‌ బోర్డు మెంబర్‌ మల్లేశ్‌ పటేల్‌, పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌, నాయకులు వెంకటయ్య, రవీందర్‌, రాఘవేందర్‌రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో స్పీకర్‌ ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌, కూతురు అనన్య

అనంతగిరి: వికారాబాద్‌ నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి జి.ప్రసాద్‌కుమార్‌ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మికత ప్రతీ ఒక్కరు అలవర్చుకోవాలన్నారు. పూజల్లో ఆయన కూతురు, అల్లుడు అనన్యచేతన్‌ తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడిన గీతకార్మికుడు

తీవ్ర గాయాలు

అబ్దుల్లాపూర్‌మెట్‌: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి జారిపడిన గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బండరావిరాల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఓరుగంటి భిక్షపతి గౌడ్‌ గీత కార్మికుడు. రోజు మాదిరిగానే ఉదయం కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు మోకు జారీ కిందపడ్డాడు. ఈ ఘటనలో క్షతగాత్రుడికి తీవ్రగాయాలవడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

ఆర్‌ఎంపీ వైద్యుడి అరెస్ట్‌

- నర్సుపై లైంగిక దాడి.. అశ్లీల వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన నర్సు



పోలీసుల అదుపులో అహ్మద్‌

తాండూరు టౌన్‌: నర్సుపై లైంగిక దాడిచేసి ఆ వీడియోను సామాజిక మాధ్యమంలో పోస్టు చేసిన కామాంధుడు ఆర్‌ఎంపీ వైద్యుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. తనకు మత్తు మందు ఇచ్చి లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ ఓ నర్సు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి తెలిపిన ప్రకారం.. పట్టణంలో ఓ క్లినిక్‌ నడుపుతున్న ఆర్‌ఎంపీ వైద్యుడు అహ్మద్‌ అలియాస్‌ అమ్ము ఫిబ్రవరి 21న ఓ మహిళతో ఏకాంతంగా ఉన్న వీడియోను వాట్సాప్‌ గ్రూప్‌లో పోస్టు చేశాడు. ఈ మేరకు అతడిపై మార్చి 2న పోలీసులు కేసు నమోదు చేశారు. సదరు వీడియోలో ఉన్న మహిళను తానేనని, తాను ఆర్‌ఎంపీ వద్ద నర్సుగా పనిచేస్తుంటానని.. తనకు మత్తు మందు ఇచ్చి ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడని మార్చి 11న ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఆర్‌ఎంపీ వైద్యుడిపై లైంగిక దాడి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, అర్హత లేకుండా వైద్యం చేస్తుండటంతో చీటింగ్‌ కేసులు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఆర్‌ఎంపీ వైద్యుడిని మహబూబ్‌నగర్‌ జిల్లా లోని ఉద్దండాపూర్‌లో శుక్రవారం అదుపులోకి తీసు కుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

ప్రజా పాలనతో సమన్యాయం

ఆమనగల్లు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్‌ పాలనను చూసి వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆమనగల్లు, మాడ్గుల, వెల్దండ మండలాలకు చెందిన పలువురు నాయకులు కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్‌ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్‌ పాలనలోనే ప్రజలందరికీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అందుతాయని ఆయన చెప్పారు. కాంగ్రెస్‌ పాలన న్చిన ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు, నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆయన చెప్పారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అన్ని స్థానాలలో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఏప్రిల్‌ 1న బీఎల్‌ఏలకు శిక్షణ

నాగర్‌కర్నూల్‌ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలోని ఏసీఆర్‌ గార్డెన్స్‌లో ఏప్రిల్‌ 1న అచ్చంపేట, కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల బూత్‌ లెవెల్‌ ఏజెంట్స్‌ శిక్షణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి తెలిపారు. శిక్షణ సమావేశానికి ఏఐసీసీ కో ఆర్డినేటర్‌ కొప్పుల రాజు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్‌ మంత్రి జూపల్లి కృష్ణారావు, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌, ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్‌ కాంగ్రెస్‌ అభ్యర్థి డాక్టర్‌ మల్లు రవి తదితరులు హాజరవుతారని ఆయన చెప్పారు. సమావేశానికి కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్‌బూత్‌ల ఏజెంట్‌లు, అన్ని మండలాల కాంగ్రెస్‌ అధ్యక్షులు, కార్యవర్గం, అనుబంధ సంఘాల అధ్యక్షులు హాజరు కావాలని ఎమ్మెల్యే కోరారు.